www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 2 సంచిక -266 బుధవారం11 డిసెంబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-


Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## రాజ్యసభలో ఛైర్మన్‌పై అవిశ్వాసం

పార్లమెంటులో కొనసాగుతున్న ప్రతిష్టంభన

ఉభయసభలు నేటికి వాయిదా

విపక్షాల తీరుపై స్పీకర్ ఓంబిర్లా అసహనం



న్యూఢిల్లీ,:డిసెంబర్ 10ప్రజావినికిడి:
అదానీ ముడుపుల వ్యవహారంపై పార్లమెంటు దద్దరిల్లుతోంది. గత కొన్నిరోజులుగా జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో అదానీ ముడుపుల విషయం, మణిపూర్ సంక్షోభంపై చర్చ జరగాలని ప్రతిపక్ష ఎంపీలు ఉభయ సభల్లో పట్టుబడుతున్నారు. అయితే ఈ విషయాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధపడడం లేదు. దీంతో ఉభయసభలూ ప్రారంభమైన కొద్దిసేపటికే వాయిదా పడుతున్నాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కొద్దిసేపటికే ఉభయసభలు వాయిదాపడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన 6 నిమిషాలకే వాయిదాపడింది. సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. ఈ సందర్భంగా స్పీకర్ పార్లమెంటు గౌరవాన్ని కాపాడాలని అధికార, ప్రతిపక్ష ఎంపీలను కోరారు. సభలో ఎంపీలు పార్లమెంటు గౌరవాన్ని కాపాడేలా ప్రవర్తిస్తే.. ప్రజల్లోకి మంచి సందేశం వెళుతుంది అని ఆయన అన్నారు. పార్లమెంటులో విపక్షాల నిరసనలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అసహనం వ్యక్తంచేశారు. 'మనది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం. ప్రజల ఆశలు, ఆకాంక్షలను మనం నెరవేర్చాలి.మిగతాది 2లో...

## 46 జీవోపై ప్రభుత్వ వైఖరి ఏంటి?

పోస్టుల భర్తీ విషయంలో అవలంబించిన విధానం ఏమిటి?

సరైన కౌంటర్ దాఖలు చేయండి

తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశం

తదుపరి విచారణను జనవరి 27కు వాయిదా

హైదరాబాద్,డిసెంబర్ 10ప్రజావినికిడి:
రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. తెలంగాణలో 5010 పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ కోసం రేవంత్ రెడ్డి సర్కార్ జీవో నెంబర్ 46ను సవాలు చేస్తూ.. సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు కాగా.. ప్రతివాది అయిన తెలంగాణ ప్రభుత్వానికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన 46 జీవోను సవాలు చేస్తూ.. కొందరు అభ్యర్థులు మొదట హైకోర్టును ఆశ్రయించగా.. వారి వాదనలను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ మేరకు ఆగస్టు 28వ తేదీన ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. దీంతో.. హైకోర్టు తీర్పును సవాలు చేస్తున్న మాటూరి శ్రీకాంత్ సహా.. 74 మంది అభ్యర్థులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు.అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై.. జస్టిస్ అభయ్ ఎస్ ఓక, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈ క్రమంలోనే.. ప్రతివాదులైన తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు



నోటీసులు జారీ చేసింది. 46 జీవోపై తమ వైఖరి, పోస్టుల భర్తీ విషయంలో అవలంబించిన విధానంపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 27వ తేదీకి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో.. బాధితుల తరపు న్యాయవాది ఆధిత్య సోండీ.. కేసు పరిష్కారమయ్యే వరకు ఖాళీగా ఉన్న 900 పోస్టుల భర్తీని నిలిపేయాలని వాధించారు. స్పందించిన సుప్రీం కోర్టు.. తదుపరి విచారణ వరకు వేచిచూడాలని స్పష్టం చేసింది. బాధితుల పక్షాన విచారణకు బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, ఏనుగుల రాకేష్ రెడ్డి కూడా హాజరయ్యారు. అయితే.. పోలీస్ ఉద్యోగాల భర్తీ కోసం జోవో నెంబర్ 46ను తెలంగాణ ప్రభుత్వం జారీ చేయగా.. దాన్ని డిమాండ్ చేస్తూ.. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు నిరసనకు దిగిన విషయం తెలిసిందే. జీవో నెంబర్ 46ను రద్దు చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నాలు నిర్వహించారు. కాగా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాటి పరిస్థితులకు అనుగుణంగా జీవో 46 ను తీసుకొచ్చింది. అయితే దీని వల్ల చాలా మంది అర్హులు ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని పోలీసు ఉద్యోగార్థులు పెద్ద ఎత్తున ఉద్యమం చేశారు. జీవో 46ను రద్దు చేయాలని తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేయడంతో భాదితులు.. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ కన్నుమూత

సంతాపం తెలిపిన ప్రధాని , ప్రముఖులు



బెంగళూరు డిసెంబర్ 10ప్రజావినికిడి:
కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ (92) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తెల్లవారుజామున బెంగళూరులోని సదాశివనగర్‌లో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన స్వగ్రామం మద్దూరులోని సోమనహళ్లిలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.మిగతాది 2లో...

## స్వార్థ రాజకీయాల కోసం విగ్రహాలు మార్చడం బాధాకరం

కేసీఆర్ పోరాటాన్ని రూపుమాపేలా సీఎం రేవంత్ ప్రయత్నాలు

రానున్న రోజుల్లో రేవంత్‌కు గుణపాఠం తప్పదు : కవిత



2లో.

## జల్‌పల్లిలో మరోసారి ఉద్రిక్తత



మోహన్‌బాబు నివాసంలో మంచు మనోజ్‌పై దాడి

మనోజ్‌ను అడ్డుకున్న భద్రతాసిబ్బంది

గేట్లు తీయకపోవడంతో నెట్టుకొని లోపలికి వెళ్లినమనోజ్

మంచు ఫ్యామిలీలో తారాస్థాయికి చేరిన వివాదాలు

ప్రాణహాని ఉందని అదనపు డీజీపీకి మనోజ్ దంపతుల ఫిర్యాదు

2లో.

## ఎన్ని ఇబ్బందులొచ్చినా ప్రజావాణి కొనసాగిస్తాం

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం

కేసీఆర్ పాలనలో తెలంగాణ 70 ఏళ్లు వెనక్కి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్,డిసెంబర్ 10ప్రజావినికిడి:ప్రజావాణి కార్యక్రమాన్ని భవిష్యత్తులో మరింత మెరుగుపరుస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేసిన ఏడాది పూర్తయిన సందర్భంగామిగతాది 2లో...

## పోలీసుల పద్ధతి ఇది కాదు : కేటీఆర్

ఆశావర్కర్లను పరామర్శించిన కేటీఆర్



హైదరాబాద్‌డిసెంబర్ 10ప్రజావినికిడి:
పోలీసులు ఆశావర్కర్ల పట్ల ప్రవర్తించిన తీరు పద్ధతి కాదని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. పోలీసుల దాడిలో గాయపడి ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆశా వర్కర్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పరామర్శించారు. ఎవరికీ భయపడవద్దని, మీకు మేం అండగా ఉన్నామని ఈ సందర్భంగా ఆయన వారికి ధైర్యం చెప్పారు. అందరి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ ఆశావర్కర్ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు. ఇచ్చిన హామీ మేరకు తమ వేతనాన్ని రూ.18 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆశావర్కర్‌లు సోమవారం హైదరాబాద్‌లో ధర్నాకు దిగారన్నారు. ధర్నాలో ఉన్న ఆశావర్కర్లను చెదరగొట్టేందుకు పోలీసులు దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. మహిళలు అన్న గౌరవం లేకుండా మగ పోలీసులు వారిపై దౌర్జన్యం చేశారని, చీరకొంగులు లాగి అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు.

## తెలంగాణ తల్లి అవతరణం.. ఓ భావోద్వేగ క్షణం : సీఎం రేవంత్



డిసెంబర్ 10ప్రజావినికిడి:
రాష్ట్ర సచివాలయంలో సోమవారం తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా మంగళవారం ఎమోషనల్ ట్వీట్ చేశారు. " అది భావోద్వేగ క్షణం మన తల్లి అవతరణం" అంటూ సీఎం చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది."భావోద్వేగ క్షణం.. మన తల్లి అవతరణం.. నాలుగు కోట్ల బిడ్డలం.. తీర్చుకున్న రుణం.. తల్లీ తెలంగాణమా.. నిలువెత్తు నీ రూపం.. సదా మాకు స్ఫూర్తిదాయకం".. అని సీఎం రేవంత్ టీ-్వట్ చేశారు. దీనికి నిన్నటి తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సమయంలో తీసిన వీడియోను ఆయన జోడించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# స్వార్థ రాజకీయాల కోసం విగ్రహాలు మార్చడం బాధాకరం

## రానున్న రోజుల్లో రేవంత్‌కు గుణపాఠం తప్పదు : కవిత

హైదరాబాద్,డిసెంబర్ 10(ప్రజావినికిడి:
) స్వార్థ రాజకీయాల కోసం తెలంగాణ ఉద్యమసమయం నుంచి ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం ఎంతో బాధాకరమని, దీనిని తెలంగాణ ప్రజలు హర్షించరని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్ చేసిన ఉద్యమాన్ని పూర్తిగా మర్చిపోవటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ కేసీఆర్ తెలంగాణ ప్రజల్లో గుండెల్లో ఎప్పటికీ ఉంటాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహం మార్పునకు నిరసనగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ మహిళలు ఎప్పటికీ పేదగానే ఉండాలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని చెప్పారు. ఉద్యమ తల్లే తమ తల్లి అని, హస్తం గుర్తు తల్లిని ఆమోదించేది లేదన్నారు.



రేవంత్ పిట్ట బెదిరింపులకు భయపడేవారు ఎవరూలేరన్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యమకారులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చింది. జొన్నలు, మక్కలు ఇతర రాష్ట్రాల్లో కూడా పండుతాయి. పూలనే పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణది. తెలంగాణ తల్లి చేతి నుంచి బతుకమ్మను తొలగించారు. తెలంగాణ ప్రత్యేకతే బతుకమ్మ. మహిళలకేమో విగ్రహాలు.. మగవాళ్లకేమో వరాలా అని ప్రశ్నించారు. తెలంగాణ తల్లిని మార్చి కాంగ్రెస్ తల్లిని ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. 9 మంది తెలంగాణ కవులు, కళాకారులకు స్థలాలు, డబ్బులిస్తామన్నరు. గుర్తింపునకు మల్లు స్వరాజ్యం, విమలక్క, సంధ్య పనికిరారా అని ప్రశ్నించారు. గ్రాండ్‌గా ఉండే తల్లిని తీసేసి.. బీద తల్లిని పెట్టినమని రేవంత్ గొప్పలు చెప్తుండు. తెలంగాణ మహిళలు ఎప్పటికీ పేదగానే ఉండాలా అన్ని ప్రశ్నించారు. మీ నోటి నుంచి ఎరుకల నాంచారమ్మ, బీడీ కార్మికుల మహిళల పేరు రాలేదన్నారు. ఉద్యమ కాలంలో ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లిని మార్చారని విమర్శించారు. విగ్రహం పెట్టామని చెప్పి సామన్య మహిళలకు ఇచ్చిన హామీలు ఎగ్గొడతారా అని నిలదీశారు. కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని చెప్పారు. ఉద్యమ తల్లే మా తల్లి.. హస్తం గుర్తు తల్లిని ఆమోదించేది లేదన్నారు. రేవంత్ పిట్ట బెదిరింపులకు ఎవరూ భయపడరని తెలిపారు.

# జల్‌పల్లిలో మరోసారి ఉద్రిక్తత

**మోహన్‌బాబు నివాసంలో మంచు మనోజ్‌పై దాడి**

**మనోజ్‌ను అడ్డుకున్న భద్రతాసిబ్బంది**

**గేట్లు తీయకపోవడంతో నెట్టుకొని లోపలికి వెళ్లినమనోజ్**

**మంచు ఫ్యామిలీలో తారాస్థాయికి చేరిన వివాదాలు**

**ప్రాణహాని ఉందని అదనపు డీజీపీకి మనోజ్ దంపతుల ఫిర్యాదు**

హైదరాబాద్,డిసెంబర్ 10(ప్రజావినికిడి:
మంచు ఫ్యామిలీలో ఉద్రిక్తతలు మరింత వేడెక్కాయి. ఉదయం నుంచి మంచు మోహన్ బాబు, ఆయన చిన్న కుమారుడు మంచు మనోజ్ మధ్య జరిగిన చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదు. దీంతో సాయంత్రం భార్యతో కలిసి అడిషనల్ డీజీపీని కలిసిన మనోజ్ కాసేపటి క్రితం తిరిగి జల్?పల్లి చేరుకున్నాడు. లోనికి వెళ్లిన మంచు మనోజ్‌పై దాడి జరిగినట్లు తెలుస్తోంది. చిరిగిన చొక్కాతో మంచు మనోజ్ బయటకు రావడం కనిపించింది. ముందుగా మనోజ్ దంపతులను అక్కడున్న భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. గేట్లు తీయాలంటూ సెక్యూరిటీ సిబ్బందిపై మనోజ్ మండిపడ్డారు. తమ కుమార్తె లోపల ఉందని లోనికి వెళ్లాలని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఎంత సేపటికి గేట్లు తీయకపోవడంతో నెట్టుకొని లోపలికి వెళ్లాడు. కాసేపటి తరువాత మంచు మనోజ్ చిరిగిన చొక్కాతో బయటకు రావడం కనిపించింది. ఈ సమయంలో లోనికి వచ్చిన మీడియా ప్రతినిధులపై మోహన్‌బాబు ఆగ్రహంతో ఊగిపోయారు. వారిపై చేయిచేసుకున్నారు. బౌన్సర్ల దాడిలో ఓ కెమెరామెన్ కిందపడిపోయారు. మీడియా ప్రతినిధులను బయటకు నెట్టి బౌన్సర్లు గేటుకు తాళం వేశారు. మరోవైపు మంచు కుటుంబంలోని వివాదాలు పరస్పర ఫిర్యాదులతో రచ్చకెక్కాయి. మోహన్‌బాబు ఫిర్యాదు మేరకు హైదరాబాద్ పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో మనోజ్?పై కేసు నమోదైంది. ఇవాళ పెద్దమనుషుల సమక్షంలో జరిగిన మోహన్‌బాబు, విష్ణు, మనోజ్ మధ్య జరిగిన చర్చలు విఫలం అయ్యాయి. ఇది ఆస్తికోసం కాకుండా ఆత్మగౌరవం



కోసం చేస్తున్న పోరాటమని మనోజ్ తెలిపారు. తన భార్య మౌనికతో కలిసి అదనపు డీజీపీ మహేశ్ భగవత్‌ని కలిశారు. న్యాయం కోసం స్టేషన్లో ఫిర్యాదు చేస్తే పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రాణహాని ఉందని, భద్రత కల్పించాలని వారు అదనపు డీజీపీకి విజ్ఞప్తి చేశారు.రంగారెడ్డి జిల్లా జల్‌పల్లిలోని మంచు మోహన్ బాబు ఇంటి వద్ద ఉదయం నుంచి హైడ్రామా నెలకొంది. న్యాయం చేయాలంటూ మనోజ్ అదనపు డీజీపీ మహేశ్ భగవత్‌ని కలిసే వరకు పరిస్థితులు దారితీశాయి. ఇంట్లో ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు తనపై దాడికి యత్నించారని మనోజ్ పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుమారుడు మనోజ్?తో పాటు ఆయన భార్య మౌనికతో తనకు హాని ఉందని రాచకొండ కమిషనర్‌తో పాటు పహాడీషరీఫ్ పీఎస్?లో మోహన్ బాబు సైతం ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు కేసులు నమోదు చేశారు. అయితే నిన్న పెద్ద మనుషుల సమక్షంలో మోహన్ బాబుకు, మనోజ్?కు మధ్య జరిగిన చర్చలు విఫలం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరువురు స్టేషన్లో పరస్పరం ఫిర్యాదులు చేశారు. తాజాగా ఇవాళ విదేశాల నుంచి తిరిగి వచ్చిన పెద్ద కుమారుడు విష్ణుకు మోహన్ బాబు ఎయిర్?పోర్ట్?లో స్వాగతం పలికి ఇంటికి తీసుకొచ్చారు. అనంతరం సన్నిహితుల సమక్షంలో మోహన్ బాబు, విష్ణు, మనోజ్ సమస్య పరిష్కారానికి చర్చలు జరిపారు. ఈ క్రమంలోనే కాసేపటికి ఉన్నపళంగా చర్చల మధ్యలోంచే భార్య మౌనికతో పాటు బౌన్సర్లను తీసుకొని మనోజ్ బయటకు వచ్చారు. చర్చల సమయంలో తన భార్యతో పాటు తన బౌన్సర్లను బయటకు పంపే ప్రయత్నం చేశారని మనోజ్ మీడియాకు తెలిపారు. పోలీసులు సైతం తనకు రక్షణ కల్పిస్తామని నమ్మబలికి తన బౌన్సర్లనే బెదిరించారని మనోజ్ వివరించారు. పోలీసుల ఏకపక్ష ధోరణిని ఖండిస్తున్నానని స్పష్టం చేశారు. ఈ వివాదంలో తన



భార్యతో పాటు 7 నెలల కుమార్తెను లాగడం అమానుషం అంటూ మనోజ్ ఆవేదన వ్యక్తం చేశారు. మోహన్ బాబు నివాసం వద్ద నుంచి మనోజ్ వెళ్లిపోయిన తర్వాత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మనోజ్ బౌన్సర్లకు, విష్ణు బౌన్సర్లకు మధ్య వివాదం తలెత్తి ఘర్షణకు దారితీసింది. జోక్యం చేసుకున్న విష్ణు ఇరువర్గాల బౌన్సర్లకు సర్దిచెప్పి పరిస్థితి అదుపులోకి తెచ్చారు. మనోజ్ తరఫు బౌన్సర్లను విష్ణు గేటు బయటకు పంపించారు. అనంతరం ఆయన తరఫు బౌన్సర్లను మందలించారు. ఈ క్రమంలో మనోజ్ తరఫు బౌన్సర్లను కూడా భూమా మౌనిక మందలించారు. ఘర్షణ వాతావరణం తలెత్తేలా ప్రవర్తించొద్దని సూచించారు.అనంతరం బౌన్సర్లంతా గేటులోపలికి వెళ్లారు. ఇదిలా ఉండగా మోహన్‌బాబు నివాసానికి ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐ గురువారెడ్డి చేరుకున్నారు. మోహన్ బాబు వాంగ్మూలం నమోదు చేసుకుని వెళ్లిపోయారు. అనంతంర ఓ న్యాయవాది మోహన్‌బాబు ఇంట్లోకి వెళ్లారు. తదుపరి తీసుకోవాల్సిన చర్యల గురించి, చట్టప్రకారం ముందుకెళ్లాల్సిన తీరు గురించి మోహన్‌బాబు న్యాయవాదితో చర్చించినట్లు సమాచారం. మరోవైపు ఏ కుటుంబంలోనైన గొడవలు సర్వసాధారణమని ఎంతో మంది కుటుంబాల్లో వివాదాలను పరిష్కరించి కలిపానని మోహన్ బాబు తెలిపారు. తమ కుటుంబంలో తలెత్తిన వివాదాన్ని కూడా సామరస్యంగా పరిష్కరించుకుంటామని వెల్లడించారు. కానీ పరిస్థితులు అందుకు భిన్నంగావున్నాయి. ఆత్మ గౌరవం కోసం చేస్తున్న పోరాటంలో తనకు న్యాయం జరిగే వరకూ ఎక్కడివరకైనా వెళ్తానని మనోజ్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే భార్య మౌనికతో వెళ్లి డీజీపీ జితేందర్?ను కలిశారు. పోలీసుల తీరుతో పాటు తనకు జరుగుతున్న అన్యాయం గురించి వివరించారు. ఇక ఈ ఘటనలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

# అనుభవం లేకపోవడంతోనే ప్రమాదం

ముంబై, డిసెంబర్ 10ప్రజావినికిడి:మహారాష్ట్రలో సోమవారం రాత్రి జరిగిన బస్సు ప్రమాదానికి డ్రైవర్‌కు బస్సు నడిపిన అనుభవం లేకపోవడమే కారణమని తెలుస్తోంది. ప్రమాదానికి గురైన బస్సు నడిపిన డ్రైవర్ 'బ్రుహన్‌ముంబై ఎలక్ట్రిక్ సప్లయ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్‌లో ఎనిమిది రోజుల క్రితమే కాంట్రాక్ట్ ఉద్యోగిగా చేరినట్లు సమాచారం. అంతకుముందు అతనికి కేవలం కారు నడిపిన అనుభవం మాత్రమే ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. బస్సు నడపడం రాని వ్యక్తిని ప్రజా రవాణా బస్సుకు డ్రైవర్‌గా నియమించి ఏడుగురి ప్రాణాలు పోవడానికి కారణమైన 'బెస్ట్' పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం రాత్రి బస్సు అదుపు తప్పి పలు వాహనాలను ఢీకొట్టిన ఘటనలో ఏడుగురు మరణించారు. మరో 49 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో నలుగురు పోలీస్ అధికారులు కూడా ఉన్నారు.

# పడిపోతున్న ఉష్ణోగ్రతలు



న్యూఢిల్లీ, డిసెంబర్ 10ప్రజావినికిడి: దేశంలోని ఉత్తరాది రాష్ట్రాలపై చలి పంజా విసురుతున్నది. ఢిల్లీ సహా పలు ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు చలికి గజగజ వణుకుతున్నారు. దేశ రాజధాని ఢిల్లీతోపాటు జమ్మూ కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, హర్యాణా, యూపీలో చలి తీవ్రత పెరిగింది. పలుచోట్ల దట్టమైన పొగమంచు కమ్మేసింది. మంగళవారం ఉదయం ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రతలు 8.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. జమ్మూ కశ్మీర్‌లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గరిష్టంగా 10 డిగ్రీల సెల్సియస్, కనిష్టంగా మైనస్ 2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ఇక ఉత్తరప్రదేశ్‌లో కనిష్ట ఉష్ణోగ్రతలు 8 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. దీంతో ప్రజలు చలి తీవ్రతకు గజగజ వణికిపోతున్నారు. చలి మంటలతో ఉపశమనం పొందుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో 19.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అహ్మదాబాద్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు 18 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

## కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్‌ఎం కృష్ణ కన్నుమూత

**(మొదటి పేజి తరువాయి)**
ఎస్‌ఎం కృష్ణ మృతి నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం 3 రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. పూర్తి అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఎస్?ఎం కృష్ణ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. 'కృష్ణ ఒక అద్భుమైన నేత. అన్ని వర్గాల ప్రజల నుంచి అభిమానాన్ని అందుకున్నారు. తన జీవితాంతం ఇతరుల కోసం పాటు పడ్డారు. కర్ణాటక సీఎంగా అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయి. ప్రత్యేకంగా మౌలిక సదుపాయల కల్పనపై ఆయన ఎక్కువ దృష్టి సారించారు. ఎస్‌ఎం కృష్ణలో గొప్ప పాఠకుడు, ఆలోచనాపరుడు ఉన్నారు' అని ఎక్స్? వేదికగా తెలిపారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు నేతలు ఎస్?ఎం కృష్ణ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మైసూర్‌లోని మహారాజా కళాశాలలో ఎస్‌ఎం కృష్ణ పట్టభద్రుడయ్యారు. బెంగళూరులోని ప్రభుత్వ న్యాయ కళాశాలలో చదివారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో గుర్తింపు పొందారాయన. 1971- 2014 వరకు, అతను వివిధ సమయాల్లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యునిగా సేవలందించారు. డిసెంబర్ 1989 నుండి జనవరి 1993 వరకు కర్ణాటక అసెంబ్లీ స్పీకర్‌గా కూడా పని చేశారు. ఆ తర్వాత ఎస్‌ఎం కృష్ణ 1999- 2004 వరకు కర్ణాటక 16వ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ఆయన హయాంలో ఐటీ ఇండస్ట్రీలో అభివృద్ధిలోకి వచ్చింది. ఆ తర్వాత 2004-2008 వరకు మహారాష్ట్ర గవర్నర్‌గా, కేంద్ర విదేశాంగ మంత్రిగా పని చేసిన అనుభవం ఆయన సొంతం. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రావడం, కర్ణాటకలో మారిన పరిస్థితుల నేపథ్యంలో 2017 మార్చిలో బీజేపీలో చేరారు. చివరిసారిగా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీలో చేరినప్పుడు బహిరంగంగా ప్రచారం చేశారు. ఆ తర్వాత ఆయన క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నారు. కర్ణాటక అభివృద్ధికి ఆయన చేసిన సేవలు అన్నీఇన్నీ కావు.

# రాజ్యసభలో ఛైర్మన్‌పై అవిశ్వాసం

**(మొదటి పేజి తరువాయి)**మనమందరం సభా గౌరవాన్ని కాపాడుకోవాలి. కానీ, గత కొన్ని రోజులుగా జరుగుతున్న సంఘటనలు బాగుండటం లేదు' అని ఆయన పేర్కొన్నారు. ఈక్రమంలోనే ఇరు సభలు రేపటికి వాయిదా పడ్డాయి. మరోవైపు సభ వాయిదా అనంతరం అదానీ వ్యవహారంపై కేంద్రప్రభుత్వం సమాధానం ఇవ్వాలని పార్లమెంటు వెలుపల ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేస్తూ నిరసన చేశారు. సభలు వాయిదాల పర్వం నేపథ్యంలో పార్లమెంటు సజావుగా నడపకూడదని ప్రభుత్వం నిర్ణయించుకుందని కాంగ్రెస్ సీనియర్ నేత కెసి వేణుగోపాల్ విమర్శించారు. కాగా, మరోవైపు రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. సభలో గందరగోళం నెలకొనడంతో రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ మధ్యాహ్నం 12 గంటలకు సభను వాయిదా వేశారు. తిరిగి సభ పారంభమైనా మధ్యాహ్నం 1 గంటకు మరోసారి వాయిదాపడింది. ఇకపోతే పార్లమెంటులో మంగళవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. రాజ్యసభకు ఛైర్మన్‌గా ఉన్న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పై కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈక్రమంలో ఆయన పక్షపాతిగా వ్యవహరిస్తున్నారంటూ ఆక్షేపించింది. ఈ అవిశ్వాస తీర్మాణానికి తృణమూల్ కాంగ్రెస్, ఆప్‌తో సహా ఇండియా కూటమి నేతలు మద్దతిచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు 50 మంది ఎంపీల మద్దతు కావాల్సి ఉంటుంది. అయితే, 70 మంది ఎంపీలు తమకు మద్దతుగా సంతకాలు చేశారని కాంగ్రెస్ నాయకురాలు రణజీత్ రంజన్ ఓ మీడియా సంస్థతో పేర్కొన్నారు.

# కొవిడ్ వ్యాక్సిన్ ప్రజల ప్రాణాలను కాపాడింది

**కరోనా మహమ్మారి కనీవినీ ఎరగని విపత్తు**

**సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం**

**వ్యాక్సిన్ వల్ల తమ పిల్లలు మృతి చెందారంటూ పిటిషన్**

న్యూఢిల్లీ, డిసెంబర్ 10ప్రజావినికిడి:కరోనా సమయంలో కొవిడ్ వ్యాక్సిన్ ప్రజల ప్రాణాలను కాపాడిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు తెలిపింది. కరోనా వ్యాక్సిన్ కారణంగా తమ పిల్లలు మృతి చెందారంటూ ఇద్దరు మహిళల తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీవీ వరాలేతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీ వాదనలు వినిపించారు. కొవిడ్-19 మహమ్మారి కనీవినీ ఎరగని విపత్తు అన్నారు. వ్యాక్సిన్ పంపిణీ కారణంగా ప్రజల ప్రాణాలు నిలబడ్డాయన్నారు. వ్యాక్సినేషన్, దాని దుష్ప్రభావాల అంశాన్ని సుప్రీంకోర్టు ఇప్పటికే సమగ్రంగా పరిశీలించిందన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... వ్యాక్సిన్ విషయంలో ఎలాంటి వివాదం లేదని, కానీ ఆ వ్యాక్సినేషన్ తర్వాతే వారు చనిపోయారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వీరి మృతిపై నిపుణులతో కూడిన వైద్య బృందాన్ని ఏర్పాటు చేయడం, పోస్టుమార్టం నివేదికను ఇవ్వడం, నిర్దేశించిన కాల వ్యవధిలో దర్యాప్తు పూర్తి చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. ఇరువురి వాదనలు విన్నసుప్రీంకోర్టు పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తున్నట్లు తెలిపింది.

# చెరువులను కబ్జా చేసి నిర్మాణాలు

**ప్రభుత్వం స్పందించకుంటే కోర్టును ఆశ్రయిస్తా**

**ఐదు కంపెనీలపై హైడ్రా కమిషనర్‌కు కాటిపల్లి ఫిర్యాదు**



హైదరాబాద్,డిసెంబర్ 10ప్రజావినికిడి:
కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఈరోజు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను హైదరాబాద్‌లోని బుద్ధ భవన్‌లో కలిశారు. చెరువులను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్న పలు కంపెనీలపై ఆయన ఫిర్యాదు చేశారు. ఆయా కంపెనీల పేర్లు ఏమిటో కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... ఈ అక్రమ నిర్మాణానికి సంబంధించి రెండు నెలల క్రితమే తాను మాట్లాడానని వెల్లడించారు. దీనిపై ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకుంటే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. రెండు నెలల క్రితం తాను మాట్లాడానని, ఆ తర్వాత పది రోజులకు... అనుమతులు ఇచ్చిన నిర్మాణాల జోలికి వెళ్లబోమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేశారని గుర్తు చేశారు.కానీ చెరువులను కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తాను ఫిర్యాదు చేసిన ఐదు కంపెనీలకు అనుమతులు ఇచ్చిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం... గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ కొత్త నాటకానికి తెరలేపిందని విమర్శించారు.అక్రమ నిర్మాణాలు చేపడుతున్న ఈ ఐదు సంస్థలకు సంబంధించి అనుమతులిచ్చిన అధికారులు, అండగా ఉన్న ప్రభుత్వ పెద్దలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూఆక్రమణలను అరికట్టేందుకు కొత్త చట్టాన్ని తీసుకురావాల్సి ఉందన్నారు.

**ఎన్ని ఇబ్బందులొచ్చినా**

# ప్రజావాణి కొనసాగిస్తాం

**(మొదటి పేజి తరువాయి)**
లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. వారి నుంచి పలు సూచనలు స్వీకరించారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం 70 ఏళ్లు వెనక్కి పోయిందని.. భట్టి విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని%ొ%ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని భట్టి వివరించారు. అధికారంలో వచ్చిన వెంటనే ప్రజావాణి ఏర్పాటు చేశామని.. నిరంతర పర్యవేక్షణతో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతుందని భట్టి అన్నారు. అదిలాబాద్‌లో పోడు భూముల పట్టాలకు పరిష్కారం తమ ప్రభుత్వం చూపిందన్నారు. అటవీ ప్రాంతాల్లో నివసించే వారికి సోలార్ పవర్ ఇస్తాం అని భట్టి పేర్కొన్నారు. ప్రజల కోసం నిరంతరం తమ ప్రభుత్వం పని చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రజా వాణి మొదలై నేటికీ ఏడాది పూర్తయింది. ఏడాది కాలంలో అనేక సమస్యలకు పరిష్కారం చూపిన ప్రజావాణి.. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్లో సమస్యలకు పరిష్కారం చూపింది. ఏ శాఖలో సమస్య ఉన్న ప్రజావాణి పరిష్కారం చూపుతుందన్నారు. ఆరోగ్య సమస్యలకు కూడా ప్రజావాణి ద్వారా సంబధిత హాస్పటల్‌కి పంపి చికిత్స చేసుకోవచ్చున్నారు. స్కాలర్షిప్ సమస్యలను ప్రజావాణి తీర్చిందని భట్టి తెలిపారు. గల్ఫ్ కార్మిక బాధితులకు ప్రజావాణి ద్వారా సహాయం అందిందన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
బుధవారం11 డిసెంబర్ 2024

# విగ్రహం చుట్టూ రాష్ట్ర రాజకీయాలు

**తెలంగాణ తల్లి నూతన విగ్రహం 'అమ్మ'ను**
**తలపిస్తున్నదంటున్నఅధికార కాంగ్రెస్ కాంగ్రెస్**
**తల్లి విగ్రహమంటూ బిఆర్ఎస్ విమర్శలు 'హస్తం' గుర్తుకు**
**దగ్గరగా మార్చుకున్నారంటున్నబిజెపి**
**తెలంగాణతల్లినివక్రీకరిస్తే కఠిన చర్యలు :ఉత్తర్వులు జారీ**
**కాంగ్రెస్ తల్లిని తిరస్కరిస్తున్నాం :ఎంఎల్సి కవిత**
**మార్పుతెస్తామని మోసగించి..తెలంగాణ తల్లినే మార్చేశారు :**
**బిజెపి నేత డికె అరుణ ఫైర్**




హైదరాబాద్:,డిసెంబర్ 10ప్రజావినికిడి:
రాష్ట్ర రాజకీయాలు తెలంగాణతల్లి విగ్రహం చుట్టూ తిరుగుతున్నాయి. తెలంగాణ తల్లి విగ్ర హం కేంద్రంగా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యు ద్ధం నడుస్తోంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీలు పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. సాధారణ మహిళా రూపంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించామని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించగా, తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడంపై బిఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చే స్తోంది. సచివాలయంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లి కొత్త విగ్రహం ప్రతిష్టించగా, ప్రభుత్వానికి పోటీగా మే డ్చల్‌లో బిఆర్ఎస్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించింది.కెసిఆర్ రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహం రాజరిక పోకడలతో, ఆయన కుమార్తె రూపురేఖలతో ఉం దని రేవంత్ రెడ్డి ఇదివరకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఆరోపించేవారు. తాము అధికారంలో కి రాగానే మార్పించేస్తామని చెప్పేవారు. చెప్పిన్నట్లుగానే కొత్త రూ పు రేఖల తో తెలంగాణ తల్లి విగ్రహం తయారు చేయించి సోమవారం (డిసెంబర్ 9) సచివాలయం ఆవరణలో ప్రతిష్టించారు. తెలంగాణ తల్లి విగ్రహం రాచరికపు పోకడలకు దూ రంగా అమ్మ ను తలపించేలా తీర్చిదిద్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో, విగ్రహావిష్కరణ సందర్భంగా చెప్పారు.తెలంగాణతల్లి రూపకల్పనలో సంప్రదాయం, సంస్కృతులను ప రిగణనలోకి తీసుకున్నామన్నారు. కొత్త విగ్రహం సాధారణ తెలంగాణ మ హిళకు ప్రతిరూపంగా చాలా నిరాడంబరంగా ఉం దని,పోరాటాలతో తెలంగాణ ఏర్పడిందని సూచి స్తూ దిగువన నీలిరంగు పీఠం చుట్టూ మూసిన పిడికిలి బొమ్మలున్నాయని అధికార పార్టీ నేత లు చెబుతుండగా, తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలు మా ర్చడం పై బిఆర్ఎస్ నాయకులు భగ్గుమన్నారు. ఆ వి గ్రహం తెలంగాణ తల్లి విగ్రహం కాదు.. కాంగ్రెస్ తల్లి విగ్ర హం అంటూ విమర్శించారు.తెలంగాణ తల్లి వి గ్రహాన్ని అధికారికంగా ఆమోది స్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విష యం తెలిసిందే. ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాన్ని జరపాలని నిర్ణయించింది. తెలంగాణ తల్లి.. జాతి అస్తిత్వ, ఆత్మగౌరవ ప్రతీక కాబట్టి..చిత్ర రూపాన్ని వక్రీకరించడం, వేరే విధంగా చూపడాన్ని నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. తెలంగాణ తల్లి చిత్రాన్ని బహిరంగంగా లేదా సోషల్ మీడియాలో మాటలు, చేతలతో అగౌరవపరచడం, ధ్వంసం చేయడం, కాల్చడం, అవహేళన చేయడం, అవమానించడం, కించపరచడాన్ని నేరంగా పరిగణించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

### సచివాలయంలో పెట్టిన కాంగ్రెస్ తల్లిని తిరస్కరిస్తున్నాం : ఎంఎల్సి కవిత

తెలంగాణ ఆత్మకు ప్రతీక అయిన తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి తెలంగాణ వారసత్వాన్ని రూపుమాపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని బిఆర్ఎస్ ఎంఎల్సి కల్వకుంట్ల కవిత ఆరోపించారు. అలాంటి అస్థిత్వాన్ని, వారసత్వాన్ని, ప్రజల భావోద్వేగాలను కేవలం ఒక జిఒతో మార్చలేరని తేల్చిచెప్పారు. తెలంగాణ తల్లి చేతిలో ఉన్న జొన్నలు, మక్కలు తెలంగాణకు ప్రతీక అని ముఖ్యమంత్రి అంటున్నారని, కానీ అవి ఇతర రాష్ట్రాల్లో పండవా..? అని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల్లోనూ అవి పండుతున్నప్పుడు మరి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త విగ్రహంలో ఏం ప్రత్యేకత ఉన్నదని అడిగారు. పార్టీ పిలుపు మేరకు మంగళవారం నాడు బిఆర్ఎస్ ఎంఎల్సి కల్వకుంట్ల కవిత అనేక మంది కార్యకర్తలు, నాయకులతో కలిసి తెలంగాణ భవన్‌లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా ఎంఎల్సి కవిత మాట్లాడుతూ%ఔ%ప్రపంచంలో మనకు మాత్రమే ప్రత్యేక పండుగ అయిన బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి మాయం చేసి ఆ స్థానంలో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తును పెట్టి ఇదే తెలంగాణ తల్లి అనడం చాలా దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యను ప్రతి ఒక్క తెలంగాణవాది ఖండిస్తున్నారని తెలిపారు. తొమ్మిది మంది కవులు, కళాకారులను సన్మానించడమే కాకుండా ఇంటి స్థలం, రూ. కోటి ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం సంతోషమే కానీ అందులో మహిళలకు స్థానం లేదా..? అని ప్రశ్నించారు. కవులు, కళాకారులను గుర్తించడంలో ఆడబిడ్డలు ఎక్కడ..? అని అడిగారు. విమలక్క, పీవోడబ్ల్యూ సంధ్య, మా భూమి సంధ్య, బెల్లి లలిత, మల్లు స్వరాజ్యం, సదాలక్ష్మి మీకు గుర్తుకు లేదా..? అని నిలదీశారు. మహిళలకు ఏమో విగ్రహాలు%ఔ% పురుషులకేమో వరాలిస్తున్నారని, ఇది చాలా అన్యాయం అని వ్యాఖ్యానించారు.

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టారు కాబట్టి ఇక మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వరా..? అని నిలదీశారు. తెలంగాణ తల్లి రూపం బీద తల్లి రూపమని ముఖ్యమంత్రి అంటున్నారని, అంటే తెలంగాణలో కూలినాలి చేసుకునే బీద ప్రజలు ఎప్పటికీ కూలీలు గానే ఉండాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశమా..? అని ప్రశ్నించారు. వాళు గొప్ప వాళ్ళు కావాలని అనుకోకూడదా అని అడిగారు. కాగా, అమ్మను చూస్తే ఒక స్ఫూర్తి పొందే విధంగా ఉండాలని, అలా స్ఫూర్తిదాయకంగా మన సంప్రదాయానికి ప్రతీక అయినా బతుకమ్మను చేతిలో పట్టుకుని ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి కాంగ్రెస్ తల్లిని పెట్టుకోవడం వల్ల ప్రజల మనసులు నొచ్చుకున్నాయని చెప్పారు. తన ప్రసంగంలో ఒక్క సామాన్య మహిళల పేరు కూడా తీయని సీఎంను ఎలా నమ్మాలి..? అని అడిగారు. సచివాలయంలో పెట్టినటువంటి కాంగ్రెస్ తల్లిని తిరస్కరిస్తున్నామని ఎంఎల్సి కవిత ప్రకటించారు. ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలి : ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఎంఎల్సి కవిత డిమాండ్ చేశారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆశా వర్కర్లను గౌరవంగా ప్రగతి భవన్ కు పిలిపించి మాట్లాడి వారి వేతనాలను పెంచారని, కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి మాత్రం ఆశా వర్కర్ల మీద దాష్టికం జరుగుతుంటే చూస్తూ ఊరుకున్నారని అన్నారు. ఒకపక్క పేద తల్లి విగ్రహాన్ని పెట్టామని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి%ఔ% ఆశా వర్కర్ల మీద దాష్టకం చేశారని ధ్వజమెత్తారు.

### పసిడి వర్ణం తెలంగాణ తల్లి విగ్రహమే నిలువెత్తు సాక్ష్యం : వేముల

అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ%ఔ%తెలంగాణ తల్లి దీవెనలతో నా రాష్ట్రం పసిడి తెలంగాణ గా విరాజిల్లాలని కెసిఆర్ జూన్ 22, 2023 నాడు తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం ప్రారంభోత్సవంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఆవిష్కరించారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ వేముల ప్రశాంత్‌రెడ్డి ట్వీట్ చేశారు. కెసిఆర్ అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్కడా అవిష్కరించలేదని అంటున్న రాష్ట్ర ముఖ్యమంత్రి,మంత్రులకు హుస్సేన్ సాగర తీరాన అమరవీరుల స్మారక చిహ్నం ప్రాంగణంలో కొలువుదీరిన పసిడి వర్ణం తెలంగాణ తల్లి విగ్రహమే నిలువెత్తు సాక్ష్యం అని పేర్కొన్నారు.

### మార్పు తెస్తామని మోసగించారు తెలంగాణ తల్లినే మార్చేసారు: డికె అరుణ

తెలంగాణ తల్లి కొత్త విగ్రహంపై బిజెపి పార్టీ విమర్శలు చేసింది. తెలంగాణ తల్లి కొత్త విగ్రహంపై బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ ఎక్స్ వేదికగా వేదికగా స్పందించారు. ఇదేం ఖర్మ మన తెలంగాణ తల్లికి.. అంటూ మండిపడ్డారు. మార్పు తెస్తామని మోసగించారు%ఔ%తెలంగాణ తల్లినే మార్చేసారు ..అంటూ ట్వీట్ చేశారు. కీర్తి కిరీటంతో కళకళలాడే తెలంగాణ తల్లిని బోసిగా నిలబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కిరీటాన్ని ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. తెలంగాణ సంస్కృతికి చిహ్నమైన బతుకమ్మను తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రని చీరతో దైవత్వం ఉట్టిపడే తెలంగాణ తల్లికి పచ్చ చీర చుట్టారని మండిపడ్డారు. ఆఖరికి చేతి భంగిమను కూడా "హస్తం" గుర్తుకు దగ్గరగా మార్చుకున్నారని విమర్శించారు. అయితే ఎంఎల్సి కోదండరాం, సిపిఐ ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు తెలంగాణ తల్లిని మాతృమూర్తిని ప్రతిబింబిచేలా ఉందని చెప్పారు.

---

### యూపీఎస్సీ సివిల్స్ ఇంటర్వ్యూకి

## 90 మందికిపైగా అర్హత!

### సత్తా చాటిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు

న్యూఢిల్లీ,డిసెంబర్ 10ప్రజావినికిడి:యూపీఎస్సీ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షల ఫలితాలు విడుదలైన సంగతి తెలిసిందే. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి సెప్టెంబర్ 20, 21, 22, 28, 29 తేదీల్లో మెయిన్ పరీక్షలు జరిగాయి. ఈ ఫలితాలను డిసెంబర్ 9న సాయంత్రం యూపీఎస్సీ విడుదల చేసింది. పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)కు అర్హత సాధించిన అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్లతో కూడిన జాబితాను విడుదల చేసింది. ఈ ఏడాదికి మొత్తం 1056 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు యూపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించి జులై 1న ఫలితాలు వెల్లడించారు. ఆ తర్వాత సెప్టెంబర్‌లో మెయిన్స్ నిర్వహించగా తాజాగా ఫలితాలు వెల్లడించారు. యూపీఎస్సీ పరీక్షలు మొత్తం మూడు దశల్లో జరుగుతాయి. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు పూర్తవగా త్వరలోనే ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. ఇంటర్వ్యూలో సత్తా చాటిన అభ్యర్థులను ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్, ఇతర కేంద్ర (గ్రూప్ ఏ, గ్రూప్ బి) సర్వీసులకు ఎంపిక చేస్తారు. అయితే మెయిన్స్‌లో క్వాలిఫై అయిన వారిని మాత్రమే ఇంటర్వ్యూకి అనుమతిస్తారు.

## గ్రూప్ 2 పరీక్షలు యథాతథం

### వాయిదాకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్,డిసెంబర్ 10ప్రజావినికిడి: తెలంగాణ గ్రూప్ 2 పరీక్షలు మరో నాలుగు రోజుల్లో జరగనున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే హాల్ టికెట్లు కూడా టీజీపీఎస్సీ విడుదల చేసింది. అయితే గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ కొందరు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వీటిని సోమవారం విచారించిన హైకోర్టు వాయిదాను తిరస్కరించింది. డిసెంబరు 15, 16 తేదీల్లో జరగనున్న పరీక్షలకు ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని, ఈ పరిస్థితుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. కాగా డిసెంబరు 16న రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) పరీక్షలున్నందున గ్రూప్ 2ను వాయిదా వేయాలని కోరుతూ టీజీపీఎస్సీకి ఇచ్చిన వినతిపత్రంపై స్పందించకపోవడాన్ని సవాలు చేస్తూ ఆర్.జ్యోతి అనే అభ్యర్థితోపాటు వివిధ జిల్లాలకు చెందిన సుమారు 22 మంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ పుల్లా కార్తీక్ ఇరు పక్షాల వాదనలు విన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ డిసెంబర్ 16న గ్రూప్ 2 కి సంబంధించి పేపర్ 3, 4 పరీక్షలు ఉన్నాయని, అదేరోజు ఆర్ఆర్‌బీ పరీక్ష కూడా ఉందని అన్నారు. రెండింటికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒక పరీక్ష రాస్తే మరో పరీక్షను కోల్పోవల్సి వస్తుందని, అందువల్ల గ్రూప్ 2 పరీక్షలను రీషెడ్యూల్ చేయమని కోరుతూ టీజీపీఎస్సీకి నవంబరు 25న వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోలేదన్నారు.ఇక మరోవైపు టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. 783 పోస్టులకు 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని, ఇప్పటికే హాల్‌టికెట్లు కూడా డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు.

---

## గిరిజన హాస్టల్‌లో ఫుడ్ పాయిజనింగ్

వికారాబాద్‌డిసెంబర్ 10ప్రజావినికిడి:
వికారాబాద్ జిల్లా, తాండూరు పట్టణం సాయిపూర్‌లోని గిరిజన బాలికల వసతిగృహంలో 10మంది విద్యార్థిను లు మంగళవారం ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థత కు గురయ్యారు. గమనించిన ఇన్‌ఛార్జి విశ్వకుమారి స్థానిక ఉపాధ్యాయుల సహకారంతో వా రిని చికిత్స కోసం తాండూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం వారిని మళ్లీ వసతిగృహానికి తీసుకొచ్చారు. వచ్చిన గంట తర్వాత చికిత్స పొందిన ఐదుగురు కడుపులో మళ్ళీ నొప్పి వస్తుందంటూ చెప్పడంతో వారిని మాతాశిశు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. గిరిజన వసతి గృహంలో మొత్తం 30 మంది విద్యార్థినులు ఉంటున్నారు. భోజనం వ డ్డించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ స్థానిక వసతి గృహం, పాఠశాల ఇన్‌ఛార్జి వంట మనుషులను హెచ్చరించినా పట్టించుకోలేదని విద్యార్థినులు చెబుతున్నారు.



విద్యార్థినులు ఫుడ్ పా యిజన్ కారణంగా అస్వస్థతకు గురై ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ మనోహర్ రెడ్డి సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు విన్నవించడంతో ఆయన వెంటనే తహసిల్దార్ తారాసింగ్‌కు సమాచారం చేరవేశారు. వెంటనే ఆసుపత్రికి బయలుదేరి జరిగిన ఘటన పైన ఆరా తీశారు. వీరితోపాటు స్థానిక కౌన్సిలర్లు రత్నమాల, నీరజ రెడ్డి, మార్కెట్ కమి టీ ఛైర్మన్ బాల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నర్సింలు వసతి గృహాన్ని సందర్శించి వి ద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం అక్కడి పరిసరాలతోపాటు భోజనశాలను సైతం పరిశీలించారు. విద్యార్థులకు భోజనం వడ్డించడంలో వంట నిర్వాహకులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సిద్దిపేటలో తిరుమల శ్రీవారి ఆలయం నిర్మించండి

**టీటీడీ ఛైర్మన్‌కు హరీష్‌రావు వినతి**

హైదరాబాద్,డిసెంబర్ 10ప్రజావినికిడి: తెలుగు ప్రజలంతా కలియుగ ప్రత్యక్ష దైవంగా కొలిచే తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం.. త్వరలోనే సిద్దిపేట లో కొలువు దీరనుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. మంగళవారం (డిసెంబర్ 09న) తిరుపతి వెళ్లిన హరీశ్ రావు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడిని కలిశారు. సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు ప్రాంతంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర దేవాలయ నిర్మాణం చేపట్టాలని కోరారు. వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం కోమటి చెరువు ప్రాంతంలో ఇప్పటికే.. 5 ఎకరాల 10 గుంటల స్థలాన్ని మంజూరు చేశామని టీటీడీ ఛైర్మన్‌తో హరీశ్‌రావు తెలిపారు. గతంలోనే టీటీడీకి చెందిన ఇంజనీరింగ్ అధికారులు కోమటి చెరువు ప్రాంతంలో పర్యటించి ఆలయ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారని బీఆర్ నాయుడికి తెలిపారు. అందులు అనుగుణంగానే ఆలయ నిర్మాణ నమునా, డిజైన్లను కూడా రూపొందించారని వివరించారు. తిరుపతి వెంకటేశ్వర స్వామిని తెలుగు ప్రజలంతా ఎంతో ఇష్టంగా కొలుస్తారని.. ఇలవేల్పుగా భావిస్తారని తెలిపారు. అలాంటి శ్రీవారి ఆలయం సిద్దిపేటలో నిర్మించడం గొప్ప అదృష్టమని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు.వచ్చే టీటీడీ బోర్డు మీటింగ్‌లో సిద్దిపేటలో వెంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి ఆమోదం తెలిపేలా చొరవ తీసుకోవాలని హరీష్ రావు విజ్ఞప్తి చేశారు. కాగా.. ఆలయ నిర్మాణ పనుల శంకుస్థాపనకు ముఖ్య అతిథిగా బీఆర్ నాయుడినే రావాల్సిందిగా హరీష్ రావు కోరారు. అందుకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించారు. వెంటనే చీఫ్ ఇంజనీర్ అధికారి, సంబంధిత అధికారులను పిలిచి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. దీంతో.. సిద్దిపేటలో త్వరలోనే.. తిరుమల తిరుపతి వేంకటేశ్వరుడు కొలువుదీరనున్నాడన్న మాట.కాగా.. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో.. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో తిరుమలేశుని దేవాలయాలు నిర్మించటమే కాకుండా పాడుబడిపోతున్న ప్రముఖ పుణ్యక్షేత్రాలను పునరుద్ధరించే బృహత్కార్యాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే.. సిద్దిపేటలో కూడా టీటీడీ ఆలయాన్ని నిర్మించేందుకు గతంలోనే ప్రతిపాదన చేశారు. అందుకు కావాల్సిన స్థలాన్ని కూడా కేటాయించటం.. దాన్ని టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించటం, డిజైన్లు కూడా ఫైనల్ చేయటం జరిగిపోయాయి. అయితే.. తెలంగాణ, ఏపీల్లో ప్రభుత్వాలు మారటం, టీటీడీ బోర్డు కూడా మారిపోవటంతో.. ఈ నిర్మాణ పనులు పట్టాలెక్కలేదు. దీంతో.. హరీష్ రావే మరోసారి టీటీడీ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లటం గమనార్హం.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఎన్‌ఎఫ్ హెచ్‌ఆర్ సి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్ జాతీయ మానవ హక్కుల దినోత్సవం..




ప్రజావినికిడి, (ముషీరాబాద్):
అంతర్ జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఎన్‌ఎఫ్ హెచ్‌ఆర్ సి రాష్ట్ర అధ్యక్షులు సోమ రామ్మోహన్ గుప్త, జనరల్ సెక్రటరీ ఎన్.ఎస్ అజయ్ నాయుడుఆధ్వర్యంలో ముషీరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికిముఖ్య అతిథులుగా జాయింట్ కన్వీనర్ లీగల్ సెల్ ఉమెన్ రైట్స్ కమిషన్ అంఢ్ ఆర్టిఐ సయ్యద్ లుఖ్ మన్ అలీ, డీఎస్పీ గ్రూప్ 1 టాపర్ రవీంద్ర ధర్మా నాయక్, ఇన్స్పెక్టర్ నార్కోటిక్స్ రాము,అడ్వకేట్ సైంటిఫిక్ అండ్ లీగల్ ఎక్స్పర్ట్ ఆదోని లత, నిజాం కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సమాజ శాస్త్ర విభాగం డాక్టర్ కే.భవాని శంకర్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, సమాజంలో జరుగుతున్న మహిళలపై దాడులను ఖండించడమే కాకుండా కుల మతాతలకుఅతీతంగా సమన్యాయం చేయడానికే ఎన్ ఎఫ్ హెచ్ ఆర్ సి ఏర్పడిందని కొనియాడారు. ఎలాంటి సమస్యలు ఉన్న తక్షణమే ఉచిత సలహాలను ఇవ్వడమే కాకుండా పరిష్కారం వైపు పయనిస్తుందని అభినందించారు. సమాజంలో ఇలాంటి ఉమెన్ రైట్స్ కౌన్సిల్స్ కూడా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. మహిళల సేవా రంగంలో ఎలాంటి అపేక్ష లేకుండా నిస్సంకోచితంగా ఉదార స్వభావంతో సముచిత న్యాయం జరగడం ఎంతో ఆబినందదాయకమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఎన్‌ఎఫ్ హెచ్‌ఆర్ సి సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింప జేయాలని సంస్థ ప్రెసిడెంట్ రామ్మోహన్ గుప్త పిలుపునిచ్చారు.
అనంతరం ఎన్ ఎఫ్ హెచ్ ఆర్ సి జనరల్ సెక్రటరీ ఎన్ఎస్ అజయ్ నాయుడు జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. కేకును కట్ చేసి తినిపించారు. పలువురు శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

# మీడియా ప్రతినిధులపై మోహన్ బాబు దాడికి టీడబ్ల్యూజేఎఫ్ ఖండన...



ప్రజావినికిడి, (కుత్బుల్లాపూర్):
మీడియా ప్రతినిధులపై సినీ నటుడు మోహన్ బాబు దాడి చేయడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) తీవ్రంగా ఖండించింది. ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగాఉన్నమీడియాకు జవాబుదారిగా ఉండాల్సిన వ్యక్తులు అసహనంతో భౌతికదాడులకుపాల్పడడం సరైంది కాదని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్య పేర్కొన్నారు. సమాజానికి వాస్తవాలు చెప్పడం కోసం పాత్రికేయులు వృత్తి నిబద్ధతతో పని చేస్తారని,అలాంటి మీడియా ప్రతినిధులపై దాడీ చేసిన మోహన్ బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. మీడియా ప్రతినిధులపై దాడి చేసిన మోహన్ బాబుపై కేసు నమోదు చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# రెండవసారి ప్రపంచ స్థాయిలో సత్తా చాటిన

## తెలంగాణ రాష్ట్రా రిటైర్డ్ గెజిటెడ్ ఆఫీసర్ పెరుమాళ్ళ ప్రదీప్ కుమార్..


**రెండు బంగారు పతకాలు కైవసం చేసుకుని వరల్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ గా ప్రదీప్ కుమార్..**



ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
రాచకొండ కమిషనరేట్ లో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ హెూదాలో విధులు నిర్వహించి రిటైర్ అయిన పెరుమాళ్ల ప్రదీప్ కుమార్ వరల్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని ప్రపంచ స్థాయిలో రెండు బంగారు పథకాలను సాధించారు. గత నెలలో రష్యా దేశము నందు వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషణ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ స్థాయి పవర్ లిఫ్టింగ్ కంపిటీషన్స్ లోని మాస్టర్స్ 75 కిలోల వెయిట్ క్యాటగిరీ లో ప్రథమ స్తానం తో పాటు రెండు గోల్డ్ మెడల్స్ కైవసం చూసుకుని తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచ స్థాయి లో మరోమారు విస్తరింపచేసారు.
ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రా స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ అదేవిధంగా మేనేజింగ్ డైరెక్టర్ అయిన శ్రీమతి.ఏ. సోనిబాల దేవి (ఐ ఎఫ్ ఎస్) ప్రదీప్ కుమార్ ను అభినందించటం జరిగింది,అనంతరం వారు మాట్లాడుతూ, భవిష్యత్తులో ఇలాంటి విజయాలు మరన్ని సాధించి తెలంగాణ రాష్ట్ర పెరు ప్రతిష్టలను ప్రపంచ స్థాయి లో నిలపాలని ఆకాంక్షించారు.

# కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పని చేస్తాం..

## నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి..




ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పలువురు కాలనీ, ప్రజలు వారి కాలనీలలో సిసిరోడ్లు, డ్రైనేజ్,వీధి దీపాలు, బోర్ వేల్స్ అదేవిధంగా తదితర సమస్యలపై వినతి పత్రాలు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి కి అందజేశారు. వారు సానుకూలంగా స్పందించి త్వరలోనే వారి సమస్యలను పై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం పలువురు కాలనీవాసులు నియోజకవర్గ ఇంచార్జ్ కి శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిల్లి ఆంజనేయులు, యాదగిరి,మానెయ్య, బిక్షపతి,బ్రహ్మ చారి, మధు,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వ భారతి జూనియర్ కాలేజీలో డబ్ల్యూహెచ్‌ఆర్ సి డే.. ఆవిర్భావ దినోత్సవం..




ప్రజావినికిడి,(షాద్ నగర్):
మంగళవారం రోజు ఉదయం 11 గంటలకు విశ్వ భారతి జూనియర్ కాలేజీలో డబ్ల్యూహెచ్‌ఆర్ సి డే డబ్ల్యూ హెచ్ ఆర్ సి. ఆవిర్భావ దినోత్సవం నిర్వహించడం జరిగింది ముఖ్యఅతిథిగా షాద్ నగర్ ఎస్సై బలరాం నాయక్ అదేవిధంగా స్టేట్ కన్స్యూమర్ కన్స్యూమర్ కమిషన్ మెడిటర్. క్యాట్కో వైస్ చైర్మన్ డి గోపాల్ నారాయణ డబ్ల్యూ హెచ్‌ఆర్సి సౌత్ ఇండియా రాఘవేందర్ గౌడ్ డబ్బులు హెచ్ ఆర్ సి రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ రంగన్న గౌడ్ విద్యార్థులకు అవగహన ఇస్తూ ప్రపంచంలో అందరికీ సమాన స్వేచ్ఛ న్యాయము సమానత్వము కల్పించారు. తెలియజేశారు. డి. గోపాల్ 2019 కన్స్యూమర్ చట్టం గురించి ప్రాక్టికల్ గా పాలు కల్తీ ఎలా జరుగుతుందని మిల్క్ లో పసుపును కలిపి అదే కలర్ గా ఉంటే ఒరిజినల్ అని రెడ్ గా మారితే డూప్లికేట్ అని ప్రాక్టికల్ గా చూయించడం జరిగింది. టీ పొడి తేనె వాటర్ లో వేస్తే కింది భాగము చేరితే ఒరిజినల్ అని పైభాగము తేలితే డూప్లికేట్ అని ప్రాక్టికల్గా విద్యార్థులకు చూయించి అవగాహన కల్పించడం జరిగింది ఈ మధ్యలో హెూటల్స్ లో ఫుడ్ జరుగుతున్న కల్తీలను జాగ్రత్తగా పరిశీలించాలని మెడికల్ స్టోర్ లో టాబ్లెట్ కొన్నప్పుడు బిల్లు తప్పక తీసుకోవాలని ఎక్స్పైర్ డేట్ ను చూడాలని విద్యార్థులకు చైతన్యం కలిగించడం జరిగింది ఎస్ఐ మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదవాలని తల్లిదండ్రులను గౌరవించాలని తాను చిన్నతనం నుంచి ప్రభుత్వ పాఠశాలలో హాస్టల్లో చదివి ఎన్ సి సిలో చేరాలని తెలియజేయడం జరిగింది రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ రంగన్న మాట్లాడుతూ, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని వికలాంగుల విద్యార్థులను సమానంగా చూడాలని తెలియజేస్తుందని తెలిపారు ప్రిన్సిపాల్ మధు అండ్ పార్థసారథి మాట్లాడుతూ,చక్కని ప్రోగ్రాం విద్యార్థులకు అవగాహన జరిగిందని ధన్యవాదాలు తెలియజేశారు.

# నూతన డ్రైనేజీ లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్ కుమార్..



ప్రజావినికిడి,(కొత్తపేట):
మంగళవారం రోజు కొత్తపేట డివిజన్ మోహన్ నగర్ కాలనీలో 9 లక్షల వ్యయంతో వేస్తున్నటువంటి నూతన డ్రైనేజీ లైన్ పనులను పరిశీలించిన స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ డ్రైనేజ్ లైన్ సరిఅయిటువంటి లెవెల్స్ చూసుకుని వేయాలని,మళ్ళీ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా వుండేలా చూడాలని జలమండలి అధికారులు అరిఫ్ కు సూపర్వైజర్ దయాకర్ కు తెలియజేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భూగర్భ డ్రైనేజీ లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలియజేశారు. ఈ పరిశీలనలో కాలనీ అధ్యక్షుడు రాం రెడ్డి, నాయకులు అశ్విన్ సింగ్,కొత్త తిరుమల, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో వస్తున్న మార్పులను సైద్ధాంతికంగా ఆలోచన చెయ్యాలి..

## ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి యూసుఫ్..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతులు మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ పొట్లూరి నాగేశ్వర్రావు భవన్ ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులకు నిర్వహించడం జరిగింది. ఈ తరగతులను ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యూసఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ,ఏ దేశంలోనైనా కార్మికులే అధికసంఖ్యలో ఉండి ఆ దేశాల ఉత్పత్తిని పెంచి అభివృద్ధికి మూల కారకులు కార్మికులేనని కానీ ఆ ఫలితం మాత్రం కార్మికులు అనుభవిస్తలేరని పెట్టుబడిదారులు మాత్రమే అనుభవిస్తున్నారని అన్నారు. దానికి కారణం కార్మికులు కేవలం ఉత్పత్తిలో భాగస్వాములై రాజకీయంగా దూరంగా ఉండటం వల్ల,వారు సృష్టించిన సంపదను పెట్టుబడిదారులు అనుభవిస్తున్నారని, అందుకే కార్మికులు పేద మధ్యతరగతి ప్రజలుగానే ఉంటూ పెట్టుబడిదారులు మాత్రం మరింత ధనవంతులుగా మారుతున్నారని అన్నారు. కావున కార్మికులు రాజకీయ సైద్ధాంతిక అవగాహన కలిగి ఉంటేనే కార్మికులకు తగిన ఫలితం వస్తుందని అన్నారు. కాబట్టి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో ముఖ్య నాయకులకు రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని దానిని కార్మికవర్గం ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ చిత్ర పటాలకు నివాళ్ళులు అర్పించడం జరిగింది. ఈ తరగతులకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు స్వామి ప్రిన్సిపాల్ వహించగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రవిచంద్ర,జిల్లా కార్యదర్శి శ్రీనివాస్,ఆటో యూనియన్ కార్యదర్శి కృష్ణమూర్తి, నియొజకవర్గ అధ్యక్షుడు హరినాథ్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సామెల్,మునిసిపల్ నాయకులు సిపిఐ సహాయ కార్యదర్శి దుర్గయ్య, ప్రజానాట్యమండలి ప్రవీణ్,భాస్కర్,ఏఐటీయూసీ నాయకులు మహేందర్,సాయులు, సామెల్,నర్సింహరెడ్డి,బాలాజీ, రాజకుమార్, పూర్ణచందర్, నీలిమ,తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ ధన్వంతరి గ్రామీణ వైద్య సంఘం నూతన అధ్యక్షులుగా గన్నోజు రాజు చారి..

**- 155 ఓట్ల మెజార్టీతో గెలుపు.. - పోటీలో నిలిచిన నలుగురు అభ్యర్థులు..**

**సీఎస్కే విల్లాస్ లో ధన్వంతరి గ్రామీణ వైద్యుల సంఘం ఎన్నికల సందడి..**



ప్రజావినికిడి,(షాద్ నగర్):షాద్ నగర్ ధన్వంతరి గ్రామీణ వైద్య సంఘం నూతన అధ్యక్షులుగా గన్నోజు రాజు చారి అలియాస్ "సిద్దాపూర్ రాజు" ఎన్నికయ్యారు. షాద్ నగర్ పట్టణానికి చెందిన గ్రామీణ వైద్యులు గన్నోజు రాజు చారి 155 ఓట్లు మెజార్టీతో గెలుపొందడం విశేషం. మంగళవారం షాద్ నగర్ ధన్వంతరి గ్రామీణ వైద్యుల సంఘం భవనంలో జరిగిన ఎన్నికల్లో గన్నోజు రాజు చారి పోటీ చేశారు. ఆయనకు మొత్తం 229 ఓట్లు వచ్చాయి. మరో అభ్యర్థి ఆచారి కి 74 ఓట్లు వచ్చాయి. తన సమీప ప్రత్యర్థి పై రాజు 155 ఓట్లతో గెలుపొందడం విశేషం. ఎన్నికల్లో పోటీ చేసిన జనార్ధన్ కు 15 ఓట్లు, జంగయ్య రెండు ఓట్లు దక్కించుకున్నారు. మొత్తం 320 పోలయ్యాయి. ఉదయం 11గంటల నుండి రెండున్నర గంటల వరకు ఎన్నికలు జరుగుగా, లంచ్ తర్వాత ఓట్లను లెక్కించారు. ఎన్నికల అధికారులుగా బుచ్చిబాబు,రాజేందర్ సింగ్,పద్మజ,మాతశ్రీ జానకమ్మ, బాలకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# టమాటా @ రూ.1




డిసెంబర్ 10(ప్రజావినికిడి:
దళారుల మాయాజాలంతో టమాటా పండించిన రైతన్నలు విలవిలలాడుతున్నారు. టమాటా ఏ రూ.1కి దారుణంగా పతనమైంది. ఇందుకు గల కారణాలనేకం. నిన్న మొన్నటి వరకూ టమాటా ఓ మోత మోగించింది. కొనాలంటేనే భయపడేలా చేసింది. సెంచరీ కొట్టి టమాటా సామాన్యులకు సవాల్ విసిరింది. ఆ తర్వాత చాలా రోజుల వరకూ అరవై రూపాయలు, కొద్దిరోజుల నుంచి నలభై రూపాయలు పలుకుతోంది. అయితే, మారుతున్న మార్కెట్ పరిస్థితులతో టమాటా రేటు చిన్నగా దిగొచ్చింది. కొంతకాలంగా హెచ్చు తగ్గులతో నడుస్తున్న టమాటా ధర.. ప్రస్తుతం ఒక్కసారిగా పతనమయింది. ఎంతలా అంటే.. ఊహించని రేంజ్‌లో పడిపోయింది. కిలో వంద రూపాయల వరకూ పలికిన టమాటా.. ఇప్పుడు ఒక్కరూపాయికి చేరుకోవడం టమాటా రైతులకు షాకిస్తోంది. టమాటా పండించిన రైతులను కోటీశ్వరులను చేసినట్లే, భిక్షగాళ్లను కూడా చేస్తుంది. అందుకే టమాటా ధర కొన్ని నెలలు మాత్రం పెరుగుతుంటుంది.ప్రధానంగా సెప్టంబరు నుంచి నవంబరు నెల వరకూ టమాటా ధర బాగా ఎక్కువగా ఉంటుందని వ్యాపారులు చెప్పారు. ఆ సమయంలో పంట దిగుబడి తక్కువగా ఉంటుంది. ఇతర రాష్ట్రాల నుంచి కూడా దిగుమతులు తక్కువగా వస్తుంటాయి. టమాటా ఉత్పత్తి తక్కువగా ఉండటం వల్లనే ధరలు ఆ సమ యంలో విపరీతంగా పెరుగుతుతాయి. మళ్లీ డిసెంబరు నెల నుంచి టమాటా పంట చేతికి అందుతుంది. అన్ని మార్కెట్ లో రాశులు పోసి రైతులు విక్రయించేందుకు సిద్ధమవుతుంటారు. ఈ సమయంలో టమాటా ధర తక్కువగానే ఉంటుంది. వినియోగదారుడికి కూడా కిలో ఐదు రూపాయల నుంచి పది రూపాయలకు విక్రయిస్తుంటారు. ప్రస్తుతం టమాటా ధర బాగా పడిపోయింది. పత్తికొండ రైతు మార్కెట్లో కిలో టమోటా ధర రూపా యికి పడిపోవడంతో టమోటా రైతు ఆందోళన చెందుతున్నాడు. హైదరాబాద్ మార్కెట్లో డిమాండ్ లేకపోవడంతో టమోటా ధర తగ్గిందని చెబు తున్నారు. మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతుందని చెప్పారు.నిన్న మొన్నటి దాకా కిలో పది నుండి 20 రూపాయలు పలికిన టమోటా ధర ఇప్పుడు రూపాయికి పడిపోవడంతో రైతు లబోదిబో మంటున్నాడు. టమాటా రైతు పరిస్థితి లాటరీలాగా మారింది. కనీ సం రవాణా ఖర్చులు కూడా రావడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్లో టమాటా ధర కుప్ప కూలి ఒక్క రూపాయికి పడిపోయింది. కిలో టమాటా రూపాయి పలకడంతోపాటు రైతులు కన్నీళ్లు పెట్టుకున్నారు. తెచ్చిన పంటను కొనడా నికి కూడా ఎవరూ ముందుకు రాకపోవడంతో టమాటాలను రోడ్డు పక్కన పారబోసి వెళ్లిపోయారు రైతులు. అయితే పలు ప్రాంతాల నుంచి భారీగా టమా టా దిగుబడి వస్తుండటమే రేటు పడిపోవడానికి కారణమని స్థానిక రైతులు అంటున్నారు. సరుకు ఎక్కువ ఉండడంతో మార్కెట్‌లో టమాటా కొనే వారు లేకుండా పోయారని చెప్తున్నారు. ప్రధానంగా సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకూ పంట దిగుబడి తక్కువగా ఉండడంతో టమాటా ధర ఎక్కువగా ఉంటుందని వ్యాపారులు అంటున్నారు.

అదే సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి కూడా దిగుమతులు తక్కువగా వస్తుంటాయని తెలి పారు. కానీ.. డిసెంబర్ నుంచి టమాటా పంట చేతికి వస్తుండడంతో అన్ని మార్కెట్‌లలో రాశులు పోసి రైతులు విక్రయించేందుకు సిద్ధమవుతుం డడంతో టమాటా ధర తక్కువగా ఉంటుందని గుర్తు చేస్తున్నారు. మొత్తంగా.. పతనమవుతున్న టమాటా ధర రైతులకు కన్నీళ్ళు మిగుల్చుతోంది.

ఇతర ప్రాంతాలలో కిలో రూపాయి పలుకుతున్న టమాటా హైదరాబాదు లాంటి ఏరియాలలో కిలో 30 నుంచి 40 వరకు పలుకుతోంది. సెప్టెంబర్ %–% నవంబర్, డిసెంబర్ తొలి వారంలో టమాటా కిలో 70 రూపాయల వరకు చేరుకుంది. డిమాండ్ కూడా అధికంగా ఉంది. ఎపిలో రూపాయి మాత్రమే పలుకుతున్న టమాటా హైదరాబాదు లాంటి ప్రాంతాలకు వచ్చేసరికి 400 రెట్లు పెరగడం గమనార్హం. అయితే మధ్యలో వ్యాపారులు రవాణా ఖర్చులని, ఇతర ఖర్చులని చెప్పి ధరలను అమాంతం పెంచుతున్నారు. పండించిన రైతులు నష్టపోతుంటే వారు మాత్రం కోట్లను గడిస్తున్నారు. ఆరుగాలం పంట పండించిన రైతులకు మాత్రం అప్పులను, పుట్టెడు కష్టాలను మిగుల్చుతున్నారు.

# పత్తి శ్రీను కు జన్మదిన శుభాకాంక్షలు..

## కార్పొరేటర్ రావుల శేషగిరి..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి సుభాష్ చంద్రబోస్ నగర్ వాస్తవ్యులు పత్తి శ్రీను కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించిన బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి చిన్న గౌడ్
రావుల శేషగిరిమాట్లాడుతూ,మీరు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని మనసారా కోరుకుంటూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని అన్నారు.

# ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ షురూ..

## ఏఐ, డీప్ టెక్‌లతో పౌర సేవలు నిర్వహణ

అమరావతి:,డిసెంబర్ 10(ప్రజావినికిడి:
అందుబాటులోకి వస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధం అన్న విషయం అందరికీ తెలిసిందే. ఆ కోవకే చెందిన వార్త ఇది. ఏఐ, డీప్‌టెక్ వంటి టెక్నాలజీ సేవలు వినియోగించుకుని వాట్సాప్ ద్వారా పౌర సేవలు వేగంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. మనం ప్రతీ సమాచారాన్ని పొందడానికి, చేరవేయడానికి వాట్సాప్‌ను ఎలా వినియోగిస్తున్నామో, ఇక ప్రభుత్వం కూడా మనకు అవసరమైన సేవలు వాట్సాప్‌లో అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీంతో ఇకపై వచ్చేదంతా వాట్సప్ గవర్నెన్స్ అంటూ తాజాగా ప్రకటించింది కూడా. పాలనలో మరింతగా సాంకేతికత వినియోగం అవసరమని, విభాగాల వారీగా రియల్‌టైమ్ డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ ఆ పర్యవేక్షణ బాధ్యతలను ఆర్టీజీఎస్‌కు అప్పగించింది రాష్ట్ర ప్రభుత్వం.సమర్ధవంతమైన పాలన అందించేలా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని, రియల్‌టైమ్‌లో సమాచారాన్ని సేకరించి మిగిలిన శాఖలతో అనుసంధానం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల సమాచారాన్ని ఆర్టీజీఎస్ సమీకృతం చేసి, మొత్తంగా పర్యవేక్షించాల్సి ఉంటుందని కూడా బాధ్యతలు ఫిక్స్ చేసారు. మొదటగా ప్రతిశాఖలో సమాచార సేకరణ జరగాలని, తర్వాత ఆ సమాచారాన్ని సమీకృతం చేసుకోవాలని.. అంతిమంగా 'వాట్సప్ గవర్నెన్స్' ద్వారా అత్యుత్తమ సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. మంగళవారం సచివాలయంలో సీఎంవోతో సహా ఆర్టీజీఎస్‌కు చెందిన అధికారులతో జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. కుల ధృవీకరణ దగ్గర నుంచి ఆదాయ ధృవీకరణ




పత్రం, ఇతర ధృవపత్రాలను పొందేందుకు వాట్సప్‌ను వేదిక చేసుకునేలా వ్యవస్థను రూపొందించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు ఏఐ, డీప్‌టెక్ వంటి టెక్నాలజీ సేవలు వినియోగించుకుని వేగంగా పరిష్కరించాలన్నది ప్రభుత్వ ఆలోచన. వినతుల పరిష్కార విధానం, ప్రజల సంతృప్తి స్థాయి కూడా ఆర్టీజీఎస్ పరిశీలించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. డ్రోన్లు, సీసీ కెమేరాలు, శాటిలైట్లు, ఐవోటీ డివైజ్‌ల ద్వారా సేకరిస్తున్న విజువల్స్‌ను కూడా సమీకృతం చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. ఇటీవల గూగుల్ మ్యాప్‌ల ద్వారా గుర్తించిన గంజాయి తోటలను డ్రోన్ల సాయంతో ధృవీకరించుకోవడం జరిగిందని.. అలాగే రానున్న రోజుల్లో పంట తెగుళ్లను గుర్తించి, రైతులను అప్రమత్తం చేసేందుకు డ్రోన్లు వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే రాష్ట్రంలోని రహదారులపై జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలను అన్వేషించేందుకు డ్రోన్ల ద్వారా ప్రమాద స్థలాలను గుర్తించి పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణపై రైతుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఐవీఆర్ఎస్ ద్వారా చేపట్టిన అభిప్రాయ సేకరణలో నాణ్యతకు తగ్గ ధర, 48 గంటల్లో డబ్బులు జమ చేయడం, రవాణా సౌకర్యం, గోనె సంచుల లభ్యతపై 90 శాతానికి పైగా రైతులు తమ సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. సంతృప్తి స్థాయి తెలుసుకోవడం ద్వారా మరింత మెరుగ్గా సేవలు అందించవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. ఒకవేళ ఎక్కడైనా అసంతృప్తి ఉంటే..ఎందుకు వ్యక్తమవుతోందనే దానిని పరిశీలించి తక్షణం ఆ సమస్యను పరిష్కరించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే సమాచార ప్రామాణికతను విశ్లేషించి, అవసరమైతే తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ చివరి దశకు వచ్చిందని, ఇప్పటికే 95 శాతం కుటుంబాల జియో ట్యాగింగ్ పూర్తిచేశామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ట్యాగింగ్ సక్రమంగా జరిగిందా? లేదా? అనేది సరిచూసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఆధార్ సంబంధిత సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన మరో వెయ్యి ఆధార్ కిట్ల కొనుగోలుకు సంబంధించిన రూ.20 కోట్ల నిధుల మంజూరుకు సీఎం అనుమతిచ్చారు. వీలైనంగా త్వరగా గ్రామ %–% వార్డు సచివాలయాల్లో వెయ్యి ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో రూ.100 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల పర్యవేక్షణకు ఒకే పోర్టల్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ పోర్టల్‌లో కేంద్ర ప్రభుత్వ పరిధిలో చేపడుతున్న 80 ప్రాజెక్టుల సమాచారాన్ని రియల్‌టైమ్‌లో అప్డేట్ చేయాలని చెప్పారు. ష్ట్రంలో జనన %–% మరణ ధృవపత్రాలు పొందేందుకు తలెత్తుతున్న ఇబ్బందులను శాశ్వత పరిష్కారంగా తీసుకువస్తున్న నూతన వెబ్ పోర్టల్‌ను వచ్చే ఏడాది జనవరి 1న ప్రారంభించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. పంచాయతీ రాజ్ %–% పట్టణాభివృద్ధి శాఖల సమన్వయంతో ఈ పోర్టల్ కొనసాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు.

# కొత్త బస్సుల కొనుగోలుకు ఆర్టీసీ ప్రతిపాదనలు

## ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం వివరాలు వెల్లడించిన టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డ ఆటో డ్రైవర్లు నష్టపోకుండా విధివిధానాల రూపకల్పన



అమరావతి:,డిసెంబర్ 10(ప్రజావినికిడి:అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఈ పథకం అమలుపై గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట రావు ట్విట్టర్ లో కీలక ప్రకటన చేశారు. వచ్చే సంక్రాంతి నుంచే ఫ్రీ జర్నీ అమలు చేస్తామని, దీనికోసం ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోందని ట్వీట్ చేశారు.పథకం అమలు వల్ల బస్సుల్లో రద్దీ పెరిగే అవకాశం ఉండడంతో కొత్త బస్సులు కొనుగోలు చేయాలని ఆర్టీసీ నిర్ణయించిందని చెప్పారు. ఇందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపించారని, సీఎం వాటిని పరిశీలిస్తున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం కారణంగా ఆటో డ్రైవర్లు నష్టపోకూడదని ప్రభుత్వం భావిస్తోందని, దీనికి అనుగుణంగా పథకం విధివిధానాలు రూపొందిస్తున్నామని యార్లగడ్డ పేర్కొన్నారు.



# పవన్ కు బెదిరింపు కాల్స్ నిందితుడు అరెస్ట్

విజయవాడ డిసెంబర్ 10(ప్రజావినికిడి:ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేషీకి ఫోన్ చేసి చంపేస్తామంటూ బెదిరింపు కాల్స్, మెసేజ్ లు చేసిన నిందితుడిని అరెస్టు చేశారు పోలీసులు. గతంలో అతను హోంమంత్రి అనితను కూడా బెదిరించినట్లు గుర్తించారు. నిందితుడు విజయవాడకి చెందిన నూక మల్లిఖార్జున్ గా పోలీసులు గుర్తించి అతడిని పట్టుకునేందుకు నాలుగు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. చివరకు అతడిని ఇవాళ ఉదయం విజయవాడలోనే పట్టుకున్నారు. దీంతో అతన్ని స్థానిక పీఎస్ కు తీసుకెళ్లి విచారిస్తున్నారు. పవన్ కళ్యాణ్ పేషీ నంబర్లు ఎలా దొరికాయి, ఫోన్ చేసి ఏమేం మాట్లాడాడన్న దానిపై వివరాలు సేకరిస్తున్నారు.కాగా, నూక మల్లిఖార్జున మానసిక పరిస్థితి సరిగా లేదని పోలీసులు గుర్తించారు. మద్యం మత్తులో ఇలా బెదిరింపు కాల్స్ చేసినట్లు నిర్ధారించారు. గతంలో ఇలా ఎవరెవరిని బెదిరించాడన్న దానిపై నూక మల్లిఖార్జునను పోలీసులు విచారిస్తున్నారు. విచారణలో భాగంగా గతంలో వైజాగ్ లో నూక మల్లిఖార్జునపై 354 కేసు నమోదు అయినట్లు గుర్తించారు. దీంతో ఇంకా ఏయే పోలీసు స్టేషన్లలో అతనిపై కేసులున్నాయన్న దానిపై ఆరా తీస్తున్నారు.

# ఆటో డ్రైవర్లకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్


## ఏడాదికి రూ.5000, ఆడపిల్లల పెళ్లిళ్లకు రూ.1 లక్ష సాయం

## ఆటో డ్రైవర్లపై అరవింద్ కేజ్రీవాల్ హామీల వర్షం




న్యూఢిల్లీ,డిసెంబర్ 10(ప్రజావినికిడి:
అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆటో డ్రైవర్లపై ఆమ్? ఆద్మీ పార్టీ–ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ హామీల వర్షం కురిపించారు. దిల్లీ ఆటో డ్రైవర్లకు రూ.10 లక్షల వరకు లైఫ్? ఇన్సూరెన్స్? ప్రకటించారు. దీంతో పాటు రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా కూడా ప్రకటించారు. అంతేకాకుండా ఆటో డ్రైవర్ల కూతుళ్ల పెళ్లిళ్లకు రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆటోవాలాలకు యూనిఫాం అలవెన్స్? కింద ఏడాదికి రెండు సార్లు రూ.2,500 చొప్పున ఇస్తామని చెప్పారు. ఆటో డ్రైవర్ల పిల్లలకు ఉచిత కోచింగ్ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం కోండ్లి నియోజకవర్గంలోని ఓ ఆటో డ్రైవర్ కుటుంబ సభ్యులతో కేజ్రీవాల్ మధ్యాహ్న బోజనం చేశారు. అనంతరం ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం హామీలు ప్రకటించారు. ఈ సందర్భంగా 'పూచో' యాప్?ను ప్రారంభించారు అరవింద్ కేజ్రీవాల్. రిజిస్టర్డ్? ఆటో డ్రైవర్ల మొబైల్? నంబర్స్?తో ఓ డేటాబేస్?ను దిల్లీ? ఇంటిగ్రేటెడ్ మల్టీ మోడల్ ట్రాన్సిట్ సిస్టమ్? అభివృద్ధి చేసింది. ఈ యాప్ ద్వారా ప్రయాణికులు డ్రైవర్? నంబర్?కు కాల్? చేసి రైడ్ బుక్? చేసుకోవచ్చు.ఇదిలా ఉండగా, దిల్లీలో ఉన్న 70 అసెంబ్లీ స్థానాలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్నాయి. బీజేపీ, కాంగ్రెస్?తో హోరాహోరీగా పోరాడుతున్న ఆప్?, వరుసగా మూడోసారి అధికారాన్ని దక్కించుకోవాలని తహతహలాడుతోంది.

## సాలిడ్ కమ్ బ్యాక్ కోసం సమంత ప్లానింగ్.!




### అందుకే ఆ డైరెక్టర్ తో

ఒకప్పుడు స్టార్ లీగ్‌లో కనిపించిన.. ఈ మధ్య స్లో అయ్యారు. హెల్త్ ఇష్యూస్ కారణంగా బ్రేక్ తీసుకున్న ఈ బ్యూటీ తరువాత బాలీవుడ్ మీద ఫోకస్ చేస్తున్నారు.ఎక్కువగా డిజిటల్ ప్రాజెక్టస్ మీదే దృష్టి పెట్టిన సమంత, అందులోనూ యాక్షన్ రోల్స్‌కే ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. ఆల్రెడీ రిలీజ్ అయిన షోస్‌తో పాటు సెట్స్ మీద ఉన్న ప్రాజెక్ట్స్‌లోనూ అలాంటి క్యారెక్టర్సే ప్లే చేస్తున్నారు. సమంత ఇమేజ్‌ను పూర్తిగా మార్చేసిన ప్రాజెక్ట్ ది ఫ్యామిలీ మ్యాన్ 2. అప్పటి వరకు సౌత్ సినిమాల్లో జస్ట్ గ్లామర్ హీరోయిన్‌గా మాత్రమే ఉన్న సామ్, ఈ షోలో బోల్డ్ సీన్స్‌తో పాటు యాక్షన్ సీన్స్‌లోనూ నటించారు. నార్త్ ఎంట్రీలో యాక్షన్ ఇమేజ్ సమంతకు బాగానే హెల్ప్ అయ్యింది. అందుకే అదే టీమ్‌తో వరుస ప్రాజెక్ట్స్ చేస్తున్నారు సామ్. ఆల్రెడీ ది ఫ్యామిలీ మ్యాన్ 3లోనూ సమంత కనిపించబోతున్నారన్న హింట్ ఇచ్చారు మేకర్స్. ది ఫ్యామిలీ మ్యాన్ 2 తెరకెక్కించిన రాజ్ అండ్ డీకేనే, రీసెంట్‌గా రిలీజ్ అయిన సిటాడెల్ హనీ బన్నీకి కూడా దర్శకులు. హాలీవుడ్‌లో సూపర్ హిట్ అయిన సిటాడెల్‌ను ఇండియన్ నేటివిటికి తగ్గట్టుగా మార్చి తెరకెక్కించారు రాజ్ అండ్ డీకే.




## ముఫాసాతో చాలా అనుబంధం ఉందంటున్న మహేశ్ బాబు

హాలీవుడ్ సూపర్ హిట్ బ్లాక్ బస్టర్ ది లయన్ కింగ్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి క్రేజ్ ఉందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పుడీ ఈ క్రేజీ ప్రాజెక్టుకు ప్రీక్వెల్ వస్తోంది ముఫాసా: ది లయన్ కింగ్ . ఈ క్రేజీ మూవీ డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. ఈ మూవీ తెలుగు వెర్షన్‌ముఫాసా పాత్రకు టాలీవుడ్ స్టార్ హీరో మహేశ్ బాబు వాయిస్ అందించాడు.విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో తన ఎక్జయిట్‌మెంట్‌ను షేర్ చేసుకున్నాడు మహేశ్ బాబు. అత్యంత ఐకానిక్ పాత్రల్లో ఒకటి ముఫాసా. నా కల నిజమైందని భావిస్తున్నా. నేను ఎప్పటి నుంచో చూస్తున్న పాత్రల్లో ముఫాసా ఒకరు. ముఫాసా తన కుటుంబాన్ని చూసుకునే విధానం నాకు చాలా ఇష్టం. నేను అతనితో దగ్గరి అనుబంధాన్ని కలిగి ఉన్నానని చెప్పుకొచ్చాడు మహేశ్ బాబు. హిందీ వెర్షన్‌లో ముఫాసా పాత్రకు బాలీవుడ్ యాక్టర్ షారుఖ్ ఖాన్ వాయిస్ ఓవర్ అందించాడు. ఇప్పటికే విడుదల చేసిన ట్రైలర్ యూట్యూబ్‌లో రికార్డు వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. ఫొటో రియలిస్టిక్ టెక్నాలజీతో వస్తున్న ఈ సినిమాకు అకాడమీ అవార్డ్ విజేత బేరీ జెంకిన్స్ దర్శకుడు ఆరోన్ స్టోన్, కెల్విన్ హ్యారిసన్ జూనియర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




## ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చిన తంగలాన్..

చియాన్ విక్రమ్- స్టార్ డైరెక్టర్ పా. రంజిత్ కాంబినేషన్?లో తెరకెక్కిన తంగలాన్   సినిమా ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చింది. ఈ ఏడాది ఆగస్టు 15న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్ దక్కించుకుంది. అయితే ఈ సినిమా ఓటీటీలోకి ఎప్పుడు ఎంట్రీ ఇస్తుందా అని ఎదురు చూస్తున్న ప్రేక్షకులకు సడెన్ సర్‌ప్రైజ్ ఇంచ్చింది. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండానే సైలెంట్‌గా ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్నది. తెలుగుతోపాటు తమిళం, మలయాళం, కన్నడలో ఈ చిత్రం అందుబాటులో ఉన్నది.850?ల్లో బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. గోల్డ్ హంట్ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో హీరోయిన్లు మాళవిక మోహనన్, పార్వతి తిరువొత్తులు కీలక పాత్రలు పోషించారు. జీవీ ప్రకాశ్ సంగీతం అందిచగా, స్టూడియో గ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై ఈ సినిమా రూపొందింది. అయితే తంగలాన్‌ను ఓటీటీలో విడుదల చేయొద్దంటూ తిరువళ్లూరుకు చెందిన పోర్కోడి మద్రాస్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ సినిమాలో వైష్ణవులను అవమానించేలా సీన్స్ ఉన్నాయని, బౌద్ధమతం గురించి చాలా పవిత్రంగా చూపించారని అందులో పేర్కొన్నారు. ఇప్పుడు ఓటీటీలో విడుదలైతే ఇరు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. కేసు విచారణ అనంతరం ఈ సినిమా తాజాగా ఓటీటీలో విడుదలైంది.

## రష్మికతో పోటీ పడుతున్న కీర్తీ.. సక్సెస్ అవుతారా ??



పాత్ బ్రేకింగ్‌లో ఎంత మజా ఉంటుందో.. ఆల్రెడీ ఉన్న పాత్‌లో జాగ్రత్తగా అడుగులు వేసి డెస్టినేషన్ రీచ్ కావడంలోనూ అంతే హ్యాపీనెస్ ఉంటుంది. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న విషయాలు.. రష్మిక అండ్ కీర్తీ సురేష్‌కి యాప్ట్ గా ఉంటాయి. ఇప్పుడున్న సిట్యువేషన్‌ని బట్టి రష్మిక సక్సెస్ అయ్యారు. మరి కీర్తి సురేష్ సంగతేంటి? ఎదగడం అంటే అడుగులో అడుగు వేయడం... మెట్టుకు మెట్టూ ఎక్కడం అని స్ట్రాంగ్‌గా నమ్మారు రష్మిక మందన్న. అందుకే ఎదగడానికి ఉన్న ఏ అవకాశాన్నీ ఆమె మిస్ చేసుకోలేదు. ఓ వైపు గ్లామర్, మరోవైపు పెర్ఫార్మెన్స్.. ఇటు కమర్షియల్ ఫార్ములా... అన్నిటినీ జాగ్రత్తగా కవర్ చేస్తున్నారు. మన దగ్గరే కాదు, నార్త్ సినిమాలకు కూడా బెస్ట్ ఆప్షన్‌గా కనిపిస్తున్నారు రష్మిక మందన్న. రెగ్యులర్ సినిమాల్లోనే కాదు, పీరియాడిక్ టచ్ ఉన్న మూవీస్‌కి కూడా ఆమెను తీసుకోవచ్చనే కాన్ఫిడెన్స్ క్రియేట్ అవుతోంది మేకర్స్ లో. పాటలకు కావాల్సిన గ్లామర్, సిట్యువేషన్‌కి కావాల్సిన సీరియస్‌నెస్‌నీ పండించగలరనే కాన్ఫిడెన్స్ పుష్ప2 చూశాక స్ట్రాంగ్‌గా రిజిస్టర్ అయింది ఇండస్ట్రీకి. రష్మిక రూట్లో ట్రావెల్ చేస్తున్న సౌత్ హీరోయిన్లు ఎవరు అని ఆరా తీస్తే, అందరికీ కీర్తి సురేష్ పేరు కనిపిస్తోంది. కెరీర్ స్టార్టింగ్‌లో ఫుల్ పెర్ఫార్మెన్స్ రోల్స్ కి పరిమితమయ్యారు ఈ లేడీ. తర్వాత కాస్త రూటు మార్చి కమర్షియల్ టచ్ ఉన్న సినిమాల్లో స్టార్ హీరోల పక్కన మెప్పించారు. ఇప్పుడు నార్త్ ఎంట్రీ మూవీ బేబీ జాన్ కోసం ఫుల్‌గా మేకోవర్ అయ్యారు కీర్తి. ప్యాన్ ఇండియా ప్రాజెక్టుల్లో సక్సెస్ కావాలంటే గ్లామర్‌కి ఉన్న ఇంపార్టెన్స్ గురించి బాగానే తెలుసుకున్నారు ఈ బ్యూటీ. రీసెంట్‌గా రిలీజ్ అయిన నయన మటక్క సాంగ్‌లో కీర్తిని చూసిన వారు.. రష్మిక రూట్లో పక్కాగా ట్రావెల్ చేస్తున్నారుగా..! అని అంటున్నారంటేనే... కీర్తి ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఏంటో అర్థం చేసుకోవచ్చు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613